# సేవాఫలం



సత్యం మనసంతా ఆనందంగా ఉంది...

ఇంకో నాలుగురోజుల్లో అతను ఓ ప్లాటుకు సొంతదారుడు కాబోతున్నాడు!

నిజానికి అతను సొంతంగా ఓ ఇల్లు కట్టుకోవాలని ఎన్నాళ్లనుంచో కలలు కంటున్నాడు. ముందుగా ప్లాటు కోసం డబ్బు దాస్తూ వచ్చాడు. అది ఈనాటికి ఎనభై వేలయింది.

డబ్బు మొత్తం చెల్లించే పక్షంలో గురువారం ప్లాటు రిజిష్టరు చేయించి ఇస్తానని ప్లాటు ఓనర్ అన్నాడు. కనుక ప్లాటు ధరతో పాటు రిజిస్ట్రేషన్ ఖర్చులకు కూడా తాను దాచుకొన్నది సరిపోతుంది. ఇంకో రెండేళ్లు కాస్త డబ్బులు దాచుకుని, తర్వాత బ్యాంకు లోను తీసుకొని ఇల్లు కట్టడం ప్రారంభించాలి.

ఇల్లు తాళం వేసి ఉండటం చూసి, ప్రక్కింట్లో అడిగాడు.

"మీ నాన్నగారికి ఆయాసం ఎక్కువైతే వాసంతి హాస్పిటల్‌కి తీసుకెళ్లిందండీ! ఆయన్ని అడ్మిట్ చేసుకున్నారనీ, మీరు రాగానే పంపమనీ ఇందాకే ఫోన్ చేసి చెప్పింది" ప్రక్కింటావిడ తాళంచెవులిస్తూ చెప్పింది.

"ఏ హాస్పిటల్?"

ఆమె చెప్పింది. వెంటనే హాస్పిటల్ చేరుకున్నాడు. బయటే ఉన్న వాసంతిని అడిగాడు–

"నాన్నగారికెలా వుంది? డాక్టరుగారేమన్నారు?"

"ఇంకా అలాగే వుంది. ఆయాసం వల్ల ఊపిరి తీయడం కష్టమౌతున్నది. ఐ.సి.యూ.లో ఉన్నారు. ముందు పదివేలు కట్టమంటున్నారు. మీకోసం ఆఫీసుకి ఫోన్ చేస్తే బయటకు వెళ్లారని చెప్పారు."

"అవును. ప్లాటు విషయం గురించి సుబ్బారావుగారింటికి వెళ్లాను."

"ఏమన్నారు?" ఆత్రుతగా అడిగింది.

"తర్వాత చెప్తాలే! ముందు బ్యాంకు కెళ్లి డబ్బు డ్రా చేయాలి. నాన్నగారిని చూస్తూ ఉండు!" వాచీ చూసుకుంటూ బయటకు నడిచాడు సత్యం.

●

ఈజీచైర్‌లో కళ్ళు మూసుకొని పడుకొనివున్న సత్యాన్ని చూస్తున్న వాసంతి మనసు జాలితో నిండిపోయింది.

ప్లాటు కొనాలని ఎన్నో ప్రయత్నాలు చేసి, ఎక్కడెక్కడో తిరిగి, తీరా అతని కల నిజమయ్యే సమయానికి తండ్రి అనారోగ్యంతో హాస్పిటల్ పాలవడం, డెబ్బైవేలు మంచినీళ్లలా ఖర్చయిపోవడం ఒక దెబ్బైతే.., అతని తండ్రి కూడా దక్కకపోవడం ఇంకా పెద్ద దెబ్బైంది. డబ్బు గురించి బాధపడకుండా, తండ్రి ఆరోగ్యం గురించే తపించిన అతని వ్యక్తిత్వానికి, మంచితనానికి మనసులోనే అభినందించింది వాసంతి.

ఇంతలో, "నాయనా... సత్యం!" అంటూ వచ్చిన శాస్త్రిగారిని ఇద్దరూ లోపలికి ఆహ్వానించారు. ఆయన సత్యం తండ్రికి స్నేహితుడు. ఇద్దరూ ఒకే డిపార్ట్‌మెంట్‌లో కలసి పనిచేసి రిటైరైనవారు.

"సత్యం! నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలయ్యా! ఇరవై ఏళ్ల క్రిందట మేమంతా ప్లాట్లు వేసుకోవడానికి స్థలం కొనడం, దానికి కొన్ని అడ్డంకులు వచ్చి లే-అవుట్ అప్రూవ్ కాకపోవడం, కోర్టులో కేసు జరగడం... నీకు తెలిసిన విషయమే. దానిపై మేమంతా ఆశ కూడా వదులుకున్నాము. కాని, ఇప్పుడు అది అప్రూవ్ అయి గవర్నమెంట్ పర్మిషన్ కూడా వచ్చేసింది. ఇంకో నెలరోజుల్లో ప్లాట్లు వేయడం, మెంబర్లందరికీ కేటాయించడం జరుగుతుంది. మీ నాన్న ఆనాడే మూడువేలు కట్టేశాడు కనుక ఆయన పేర కూడా ఒక ప్లాటు ఉంటుంది. ఆయన ఏకైక వారసుడిగా అది నీకు వస్తుంది. నీవు రిజిస్ట్రేషన్ ఖర్చులు మాత్రం పెట్టుకొంటే చాలు. ఇప్పుడు అక్కడ ప్లాటు విలువ రెండు లక్షలుంటుంది తెలుసా?" చెప్పడం ఆపి, సత్యం వంక చూశారాయన.

సత్యం నోట మాటరాక కన్నీళ్లతో తండ్రి ఫోటో వంకే చూస్తున్నాడు కృతజ్ఞతా భావంతో.

శాస్త్రిగారు అతని భుజం తడుతూ "నిస్వార్థంగా తల్లిదండ్రులకు చేసిన సేవలు, త్యాగాలను భగవంతుడు తప్పక గుర్తిస్తాడయ్యా!" అన్నారు తానూ మిత్రుడిని తలచుకుంటూ.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 16 ఆగస్ట్ 2001